సాక్షి జనగామ

బుధవారం ¦ 21 ¦ మే ¦ 2025



కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



పీజీ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో జిల్లాల్లో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $37^0/26^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల ఈదురుగాలులు వీస్తాయి.



పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సైకత లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

గోదావరి మాతకు చీరసారె ఇస్తున్న ఆడపడుచులు



దీపం వదులుతున్న మహిళ

అంతర్వాహిని.. పుణ్య ప్రదాయిని

'గంగేచ యమునే చైవ గోదావరీ సరస్వతీ నర్మదే సింధూ కావేరీ జలే స్మిన్ సన్నిధింకురు'.. అని నదీమ తల్లికి నమస్కరించి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అంతర్వాహినికి అంతఃకరణ శుద్ధితో పూజలు చేశారు. ఆరో రోజు మంగళవారం త్రివేణి సంగమంలో రద్దీ కొనసాగింది. కాళేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది ముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు.

- మరిన్ని వివరాలు, ఫొటోలు 8లో..

న్యూస్‌రీల్

వైభవంగా అష్టదళ పాదపద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, భక్తులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, తిరుమల ఫర్టిలైజర్స్ షాపులను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల క్రయవిక్రయాలు, రైతులు కొనుగోలు చేసిన వివరాల రిజిస్టర్లను తనిఖీ చేసి రోజువారి విక్రయాల గురించి అడిగారు. రైతులకు కొనుగోళ్ల బిల్లులను అందించాలని, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. స్టాక్ నిల్వలు, ధరల పట్టిక తప్పనిసరిగా బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. ఆయన వెంట డీఏఓ రామారావు నాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ చంద్రన్‌కుమార్ తదితరులున్నారు.

సమాజ చైతన్య నిర్మాణం కోసమే బాల సంస్కార శిక్షణ

- వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత



జనగామ: జాగృతమైన హిందూ సమాజ చైతన్య నిర్మాణం కోసమే బాల సంస్కార శిక్షణ ఉద్దేశ్యమని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హిందూ బాల సంస్కార శిక్షణవర్గకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలకు భక్తిగీతాలు, నీతికథలు, ఆధ్యాత్మిక విషయాలపై బోధించడం గొప్పవిషయమన్నారు. ఉత్సాహంతో వందలాది పిల్లలు తరగతులకు హాజరు కావడం హిందూ ధర్మం గొప్పదనమన్నారు. ఈ కార్యక్రమంలో చిలువేరు హర్షవర్ధన్, మైలారం శ్రీనివాస్, ఉల్లెంగుల రాజు, ఝాన్సీ, మణి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చల్లని విషం!

- నాసిరకం ఐస్‌క్రీంతో అనారోగ్యం
- జిల్లాలో యథేచ్ఛగా అమ్మకాలు
- కొనుగోలు చేసేందుకు వ్యాపారుల వినూత్న ప్రచారాలు
- డబ్బులిచ్చి రోగాలు కొనుక్కోవడమే..
- ప్రముఖ సర్జన్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ





వాహనంపై ఐస్ క్రీం అమ్మకాలు



పలు రకాల ఐస్ క్రీంలు

జనగామ: మండేఎండల్లో చల్లబడేందుకు చిన్నారులు తహతహలాడుతున్నారు. ఐస్ క్రీం వాహనాలు పట్టణం, గ్రామాల్లో హారన్లు మోగిస్తున్నాయి. దీంతో పిల్లలు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అమ్మా, నాన్న ఒక్క ఐస్ క్రీం అంటూ కాకా పట్టేస్తున్నారు. ఐస్ క్రీం మాట వింటేనే చిన్నారులు ఎగిరిగంతేస్తారు. ఒక్కటి కొనిస్తే మరొకటి కావాలని మారాం చేస్తారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల వరకు పెరిగాయి. విద్యాసంస్థలకు సెలవులు కొనసాగుతుండటంతో ఐస్ క్రీంకు డిమాండ్ బాగా పెరిగింది.

నాసిరకంతో అనారోగ్యం..

నాసిరకంగా తయారయ్యే ఐస్ క్రీంతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం లేకపోలేదు. స్వచ్ఛమైన పాలు, వెన్నె, వివిధ ఫ్లేవర్లు, డ్రైఫ్రూట్స్‌తో చేసే ఐస్ క్రీంల్లో కొంతమేర పోషక విలువలు ఉంటాయి. కానీ నాశిరకం, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా యథేచ్ఛగా పట్టణంలో విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు సైతం వీటిపై దృష్టి సారించకపోవడంతో అమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇక పెళ్లిళ్లు, ఇంటి వద్ద ఎలాంటి శుభ కార్యం జరిగినా మెనూలో ఐస్ క్రీంకు ప్రత్యేక స్థానం.

జిల్లాలో 250కి పైగానే..

జిల్లాలో సుమారు పది ఐస్ క్రీం తయారు చేసే కంపెనీలు ఉన్నాయి. ఇందులో పలు రకాల వెరైటీలను తయారు చేస్తున్నారు. 250కి పైగా ఐస్ క్రీం వాహనాలు సైరన్లను మోగించుకుంటూ పల్లె, పట్నంకు వెళ్తున్నాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే 60 వాహనాలకు పైగా తిరుగుతున్నాయి. ఐస్ క్రీం అమ్మకాలతో వందలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నారు.

రకరకాల ఫ్లేవర్లు..

ప్రముఖ బ్రాండ్ కంపెనీల నుంచి లోకల్ తయారీ వరకు వందలాది రకాల టేస్టీ టేస్టీ ఐస్ క్రీంల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటిలో మ్యాంగో, స్ట్రాబెర్రీ, పైనాపిల్, కుల్ఫీ, పిస్తా, వెనిల్లా ఫ్లేవర్లు కప్పు, కోన్, బాక్స్‌ల రూపంలో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వాహనాలపై సీజన్‌లో మాత్రమే విక్రయించే ఐస్ క్రీంలు కిరాణా, మెడికల్, హోటల్స్, బేకరీ తదితర దుకాణాల్లో నిత్యం అందుబాటులో ఉంటాయి. జిల్లాలో ఎండాకాలం సీజన్‌తో పాటు పెళ్లిళ్లు, శుభ కార్యాలు, ఇతర వాటికి రూ.కోటిన్నరకు పైగానే ఐస్ క్రీం వ్యాపారం జరుగుతుంది.

డబ్బులిచ్చి రోగాలు కొనుక్కోవడమే..



వేసవిలో చల్లదనం కోసం ఐస్ క్రీంలను కొనుక్కోవడమంటే డబ్బులిచ్చి రోగాలను తెచ్చుకోవడమే. ఈకొలయ్ అనే బ్యాక్టీరియా కూల్ వెదర్‌లో మల్టీప్లై అవుతుంది. ఈ వైరస్‌తో పేగు ఇన్‌ఫెక్షన్‌కు గురి చేస్తోంది. లూజ్‌మోషన్స్, డయేరియా, వాంతులతో పాటు టైఫాయిడ్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఐస్‌క్రీం 24 గంటల పాటు చల్లదనంలో ఉండడం వల్ల బ్యాక్టీరియా సజీవంగా ఉంటుంది. దానిని తినే సమయంలో అది కాస్త కడుపులోకి వెళ్లి, చిన్న, పెద్ద పేగు సంబంధిత రోగాలు, గొంతు, పొట్ట ఇన్‌ఫెక్షన్‌కు గురి చేస్తూ, రోగ నిరోధక శక్తిని తగ్గిస్తుంది. ఇది పిల్లలపై అధికంగా ప్రభావం చూపిస్తుంది. అపరిశుభ్ర వాతావరణం, కలుషితమైన వాటర్, నాణ్యత లేని పాలను ఉపయోగించే క్రమంలో ఐస్ క్రీంలో ఈ బ్యాక్టీరియా చేరుతోంది. పిల్లలు మారం చేస్తే.. అనారోగ్యం బారిన పడతామని నచ్చ చెప్పాలి.

- డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్, ప్రముఖ సర్జన్

చెట్ల తొలగింపు పనులు షురూ



బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



చెట్లు తొలగించిన అనంతరం బ్రిడ్జి

- కుంగిన ఫుట్‌పాత్.. కూలుతున్న రేలింగ్ పరిస్థితి ఏంటి?

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: ఐదు రాష్ట్రాల వారధిపై వృక్షాలుగా మారుతున్న రావి చెట్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. 'వారధికి ముప్పు' శీర్షికన సాక్షిలో ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించారు. చెట్ల తొలగింపునకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లను ఆదేశించగా.. స్పెషల్ ఆఫీసర్ పులి శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పనులను ప్రారంభించారు. మున్సిపల్ కార్మికులు భారీ క్రేన్ల సహాయంతో బ్రిడ్జికి ఇరువైపులా మహా వృక్షాలుగా పెరిగిన రావి చెట్లను తొలగిస్తున్నారు. చెట్లను పూర్తి స్థాయిలో తొలగించాలంటే రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. రావి చెట్ల వేర్లు బ్రిడ్జి లోనకు చొచ్చుకుని పోవడంతో కార్మికులకు కష్టతరంగా మారింది. చెట్టు కొన వరకు కటింగ్ చేసి అక్కడికే వదిలేస్తున్నారు. దీంతో కొద్ది రోజుల్లో మొండెం కాస్తా మొలకెత్తే అవకాశం లేకపోలేదు. ఏదేమైన ఫ్లై ఓవర్‌పై చెట్ల తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతోంది.

కుంగిన ఫుట్‌పాత్‌కు మరమ్మతు ఎప్పుడు?

బ్రిడ్జిపై కుంగిన ఫుట్‌పాత్, కూలుతున్న రేలింగ్, పెచ్చులూడి పోతున్న స్లాబ్ పరిస్థితి ఏంటనే అనుమానాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై బాటసారులు నడవకుండా ఏర్పాటు చేసిన పూలకుండీలను నేటికి తొలగించలేదు. అదే సమయంలో ఫుట్‌పాత్‌కు సమాంతరంగా రోడ్డు పెరగడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఏర్పడింది. అలాగే బ్రిడ్జి కింద ఎలాంటి వ్యాపారాలు, పనులు, దుకాణాల నిర్వహణ ఉండొద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ, పురపాలిక అధికారుల పర్యవేక్షణ కరువవడంతో అన్ని వ్యాపారాలు అక్కడే జరుగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లో ఎప్పుడూ వందలాది మంది ఉంటారు. జరగరాని ప్రమాదం జరిగితే ఏంటనే సందేహాలు సైతం వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బ్రిడ్జి నాణ్యత, సామర్థ్యం లెక్కించి రోజువారీగా వాహనాల రవాణా, లోడ్ ఎంత మేర వెళుతుందనే దానిపై దృష్టి సారించాలి. కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించి బ్రిడ్జిపై ఉన్న పూలకుండీలను తొలగించి, కుంగిన ఫుట్‌పాత్‌కు మరమ్మతు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సోమేశ్వరాలయానికి రూ.1.11లక్షల విరాళం

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఓ భక్తుడు రూ.1,11,000 విరాళం అందించినట్లు ఈఓ సల్వాది మోహన్‌బాబు మంగళవారం తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన తన్నీరు శ్రీనివాస్‌రావు, పద్మ దంపతులు స్వామివారి మొక్కుగా విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో చదువుకున్నా.. మన సంస్కృతిని మరిచిపోలేదు

- కాలేజీ వదిలేసి దసరాకు వచ్చేవాడిని
- కాకతీయ 22వ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్
- కోట, వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయంలో పూజలు



స్వయంభూ దేవాలయంలో పూజలు చేస్తున్న రాజు కమల చంద్ర భంజ్‌దేవ్, తదితరులు

హన్మకొండ/హన్మకొండ కల్చరల్/ఖిలావరంగల్: లండన్‌లో చదువుకున్నా మన సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోలేదని కాకతీయ 22వ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్ అన్నారు. మంగళవారం ఆయన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌తో కలిసి నగరంలోని వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయం, ఖిలావరంగల్ కోటలోని స్వయంభు శంభు లింగేశ్వర ఆలయంలో, వడ్డెపల్లిలోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పోచమ్మ మైదాన్‌లోని రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ప్రజలతో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కాకతీయుల రాజధాని అయిన ఓరుగల్లు సాంస్కృతికపరంగా ఎంతో అభివృద్ధి చెందిందని, పారిశ్రామిక పరంగా అభివృద్ధి జరిగేందుకు సలహాలు ఇవ్వాలని కోరారు. కాకతీయుల కాలంలో సాంస్కృతిక జీవనం విలసిల్లిందని, ఇప్పుడు ఆ సంస్కృతి, కళలు కాపాడడానికి మీరు ఏమైనా చేయగలుగుతారా అని ప్రజలు అడిగారు. కమల్ చంద్ర భంజ్‌దేవ్ స్పందిస్తూ తనకు కళలు, కళాకారులన్నా చాలా ఇష్టమని, సాధ్యమైనంతవరకు సంస్కృతిని కాపాడుతానన్నారు. తాను లండన్‌లో విద్యనభ్యసించే సమయంలో తమ వద్ద జరిగే దసరా వేడుకలకు కాలేజీ మానేసి వచ్చేవాడినన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించడం తనకు ఇష్టమన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పర్యాటకశాఖాధికారి ఎం.శివాజీ, టార్చ్ కార్యదర్శి అరవింద్ ఆర్య, సేవా టూరిజం అండ్‌కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకుడు కుసుమ సూర్యకిరణ్, పర్యాటక శాఖ ఉద్యోగులు జై నరేష్, రాజు, తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు దాస్యం విజయ్‌భాస్కర్, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జనగామ రూరల్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలసదనంను ప్రధాన న్యాయమూర్తి బి. ప్రతిమ ఆదేశాల మేరకు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం చట్టంపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలకు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ స్నేహభావంతో ఉంటుందని, ఏమైన ఇబ్బందులు ఉంటే తెలపాలన్నారు. మంచి విజ్ఞానాన్ని కలిగించే చిత్రాలను చూపించాలని నిర్వాహకులకు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులదే..

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి





జనగామ రూరల్: మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

జనగామ రూరల్: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం మండలంలోని యశ్వంతాపూర్ పరిధిలోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు జరగనున్న రెండో విడత జిల్లా స్థాయి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ స్థాపనలో విద్యార్థులను ఉన్నతమైన, ఆదర్శవంతమైన విద్యార్థులుగా సిద్ధం చేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో అందిస్తున్న అంశాలను అర్థం చేసుకొని విద్యార్థుల్లో ఆశించిన మార్పుల సాధనే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, ఏఎంఓ శ్రీనివాస్, ఏసీజీఈ రవి కుమార్, జీసీడీఓ గౌసియా బేగం, కోర్సు ఇన్‌చార్జ్‌లు మల్లిఖార్జున్, యాదగిరి, ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే కడవెండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బడిబాట కరపత్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీఈఓ భోజన్న ఆవిష్కరించారు. పోస్టర్లతో ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలను ప్రచారం చేయాలన్నారు.

జల్ శక్తి అభియాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి

ఈనెల 31వ తేదీ లోగా జల్ శక్తి అభియాన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి జల్ శక్తి అభియాన్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జల శాఖ తదితర శాఖల సమన్వయంతో జల సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ మాధురి షా, సరిత, డీఆర్డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీఈఓ భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: భూసమస్యల పరిష్కారంలో వేగం పెంచుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి డిప్యూటీ కలెక్టర్‌లు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతీ మాడ్యూల్‌లో వచ్చిన భూసమస్యల పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, మిస్సింగ్ నంబర్, భూసేకరణ, కోర్టు కేసులు, డిజిటల్ సంతకం తదితర మాడ్యుల్‌లోని సమస్యల పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. మొత్తంగా భూభారతి సదస్సు, తహసీల్దార్ కార్యాలయంలో 1,900 దరఖాస్తులు వచ్చాయని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ వేగంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌లు సుహాసిని, హనుమనాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమన్న



నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు, నాయకులు

జనగామ రూరల్: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమన్న డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను తీసుకువచ్చి వాటిని అమలు చేయాలని చూస్తుందన్నారు. జూలై 9వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జిల్లాలో పని చేస్తున్న ఆశవర్కర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముదాం రాజమణి, జిల్లా కోశాధికారి పసులాది శోభ, స్వప్న మంజుల, కవిత, అనిత, కల్పన, మమత, మల్లేష్ రాజ్, శివరాత్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సీఎండీలతో ఇబ్బందులు

● టీఎస్ఈఈయూ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, శ్రీధర్

హన్మకొండ: టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కోలో ఇన్‌చార్జ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)-327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్‌లోని టీఎస్ఈఈయూ-327 కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు గ్రహీతల సన్మానం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకంలో జాప్యంతో పాలనాపరమైన ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే నియామకాలు చేపట్టాలన్నారు. ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమం నుంచి విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడానని, నాలుగైదు రోజుల్లో సమయం ఇస్తానని చెప్పారన్నారు. అనంతరం శ్రమశక్తి అవార్డు గ్రహీతలు పి.మహేందర్ రెడ్డి, నీలం ఐలేశ్, సురేశ్ కుమార్‌ను ఎమ్మెల్యే నాయిని, ఇనుగాల శ్రీధర్, నాయకులు సన్మానించారు. పీసీసీ నాయకుడు ఈ.వి.శ్రీనివాస్ రావు, టీఎస్ఈఈయూ-327 టీజీ ఎన్పీడీసీఎల్ సెక్రటరీ కొండూరి శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి, మాధవ రావు, చిట్ల ఓదేలు, బుచ్చయ్య గౌడ్, జశ్వంత్ కుమార్, సదయ్య, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, నోడల్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో పురోగతిలో ఉన్న ఇంటర్ లింకింగ్ లైన్ల పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ లేకుండా ప్రతీ నెల ఫీడర్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ప్రీ మాన్సూన్ తనిఖీలు అన్ని ఫీడర్లలో చేపట్టాలని, తద్వారా అంతరాయాలు తగ్గుతాయన్నారు. సబ్ స్టేషన్ల నిర్వహణ చేసే సమయంలో అంతరాయం లేకుండా వేరే సబ్ స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకట రమణ, జీఎంలు వేణు బాబు, దేవేందర్, కృష్ణమోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేందర్, ఉత్తమ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలు షురూ

● ఉదయం కేయూలో విద్యార్థుల ధర్నా
● మధ్యాహ్నం నుంచి యథావిధిగా ఎగ్జామ్స్


ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ కొందరు విద్యార్థులు మంగళవారం ఉదయం కేయూలోని పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించారు. పోలీసుల చొరవతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్ విద్యార్థులతో చర్చించారు. త్వరగా పరీక్షలు జరిగితే ఎంతో మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని నచ్చజెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. టైంటేబుల్ ప్రకారం మధ్యాహ్నం 2గంటల నుంచి యథావిధిగా పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు కేయూ పరిధిలో 95 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. వీరి వెంట పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్, ఆర్ట్స్ కాలేజీ పరీక్ష కేంద్రంలో ప్రిన్సిపాల్ జ్యోతి ఉన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 22వ తేదీన జూనియర్స్ బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 మధ్య జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆధార్, స్కూల్ బోనోఫైడ్, జనన ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు రూ.300 ఎంట్రీ ఫీజుతో ఉదయం 7గంటలకు హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్ నందు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24వ తేదీన మంచిర్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పుష్కర స్నానం చేస్తున్న భక్తులు



పుష్కరుడికి నమస్కరిస్తున్న భక్తులు



వృద్ధురాలికి పుష్కర స్నానం చేయిస్తున్న కుటుంబీకులు




హైకోర్టు జడ్జికి చిత్రపటం అందజేస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్



గోదావరి తీరం.. భక్తప్రవాహం

సరస్వతీనది పుష్కర స్నానాలకు భక్తుల రద్దీ

● తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ కొనసాగింపు..
● ఆరో రోజు స్వల్పంగా తగ్గిన భక్తులు
● ముక్తీశ్వరస్వామి ఆలయ క్యూలైన్‌లో బారులుదీరిన భక్తజనం
● హైకోర్టు జడ్జి, ఎస్ఐబీ డైరెక్టర్, ఇంటెలిజెన్స్ డీజీ పుష్కర స్నానం, దర్శనం
● 50వేల మంది వరకు భక్తులు పుష్కర స్నానాలు



భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు తరలివచ్చారు. మంగళవారం ఆరో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్నాటక రాష్ట్రాల నుంచి తరలొచ్చి గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర పుణ్యస్నానాలు ఆచరించారు. నదీమాతకు పూజలు చేశారు. పిండ ప్రదాన పూజలు చేశారు. పితృదేవతలకు తర్పణాలు నిర్వహించారు. నదీమాతకు చీర, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గోదావరితీరం వద్ద భక్తప్రవాహం కనిపించింది. నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు.



కలెక్టర్, ఎస్పీ పరిశీలన

పుష్కరాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌లు, సింగరేణి, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే వాకీటాకీలతో మాట్లాడుతూ పరిశీలించారు. టెంట్‌సిటీ, ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారుల్లో బ్లీచింగ్ చల్లించి పరిస్థితిని చూశారు. పుష్కర ఘాట్ గోదావరిలో బోటు ద్వారా భద్రతను పరిశీలించారు. బస్టాండ్ ప్రాంతంలో అదనంగా చలువ పందిళ్లు వేయాలని ఆదేశించారు. ఎస్పీ ట్రాఫిక్ నియంత్రణను పకడ్బందీగా చేట్టాలని ఆదేశించారు.



అష్టమితో తగ్గిన రద్దీ..

మంగళవారం అష్టమి సందర్భంగా భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టింది. ఉదయం 10గంటల వరకు భక్తుల రద్దీ లేదు. ఆ తర్వాత క్రమక్రమంగా పెరిగింది. హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి, మంథని, కాటారం మీదుగా వాహనాలు తరలొచ్చాయి. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్లతో నియంత్రించారు. పార్కింగ్ స్థలాల్లో వాహనాల రద్దీ కొనసాగింది.

రోడ్లు శుభ్రం..

ఆదిముక్తీశ్వరస్వామి నుంచి వీఐపీ ఘాట్ వెళ్లే మార్గంలో వర్షం పడితే రోడ్లపై దిగబడకుండా గ్రావెల్ చిప్స్ వేశారు. రోడ్లపై దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీటిని చల్లుతున్నారు. గోదావరితీరం, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్‌లు, ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య కార్మికులు పనులు చురుగ్గా చేపట్టారు.

50వేల మంది స్నానాలు..

వివిధ రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు త్రివేణి సంగమం సరస్వతీనదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరారు. మంగళవారం 50వేల మంది వరకు పుష్కర స్నానాలు చేసి దర్శనాలు చేసుకున్నట్లు అధికారుల అంచనా. పలువురు భక్తులు అక్కడక్కడ వడదెబ్బకు గురయ్యారు. వారిని కాళేశ్వరం పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. కొంత మందిని ఇతర పట్టణాలకు తరలించి వైద్యసేవలందించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు అందజేత..

భక్తులకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిక ప్యాకెట్లు అందించారు. ప్రధాన తూర్పు, దక్షిణ ద్వారాల ద్వారా క్యూలైన్లలో భక్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేశారు. ప్రత్యేకాధికారిగా మనోహర్‌ను నియమించారు. ఆయన క్రౌడ్ మేనేజ్‌మెంట్ చేపట్టారు.



పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు

నదీహారతి ప్రత్యక్ష ప్రసారం..

సరస్వతి ఘాట్‌లో కాశీపండితులతో ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల నుంచి విశేష స్పందన రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. రాత్రి 7.30 గంటలకు 45 నిమిషాల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని పుష్కరాలు పూర్తయ్యే వరకు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కాశీ పండితులు ఏడుగురితో తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు. రోజురోజుకూ పరిసర ప్రాంతాల భక్తులు వీక్షించడానికి తరలి వస్తున్నారు. రాత్రి 9 వరకు కూడా వరకు భక్తులు ఆయా పరిసరాల్లో కాలక్షేపం చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

ప్రముఖుల పూజలు..


సరస్వతీనది పుష్కరాలకు ప్రముఖులు హాజరయ్యారు. హైకోర్టు జడ్జి సృజన, ఎస్ఐబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పుష్కర స్నానాలు ఆచరించి శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.


భక్తులతో పూజలు చేయిస్తున్న పురోహితుడు


పుష్కరాలకు విచ్చేసిన ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

బంగారు వర్ణంలో సరస్వతీమాత విగ్రహం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతీనది పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకశిల సరస్వతీమాత విగ్రహం మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో బంగారు వర్ణంలో దర్శమిచ్చింది. భక్తుల దృష్టిని ఆధ్యాత్మికత వైపుకు పయనించేలా కట్టిపడేస్తోంది. ఈ విగ్రహం పుష్కరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.


విద్యుత్ వెలుతురులో సరస్వతీమాత విగ్రహం


సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు


నవరత్నమాలిక హారతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, తదితరులు

ఎస్సై సంతకం ఫోర్జరీ..

● ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్.. సీపీ ఉత్తర్వులు జారీ
● తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌లో సంఘటన

వరంగల్ క్రైం: జనగామ జిల్లా తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు ఏకంగా ఎస్సై సంతకం ఫోర్జరీ చేసి అడ్డంగా దొరికిపోయారు. దీంతో వారిని సస్పెండ్ చేస్తూ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సురేశ్, రాజు కానిస్టేబుళ్లు ఇటీవల స్టేషన్ బెయిల్ విషయంలో అక్కడ ఎస్సైగా పనిచేస్తున్న శ్రీదేవి సంతకాన్ని ఫోర్జరీ చేసి, ఆ కాగితాలను కోర్టుకు సమర్పించారు. గుడుంబా అమ్ముతున్న ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ప్రాసెస్ చేయాల్సిందిగా ఎస్సై శ్రీదేవి అదే స్టేషన్ రైటర్‌ను ఆదేశించారు. దీనిని అవకాశం తీసుకున్న సదరు రైటర్‌తోపాటు మరో కానిస్టేబుల్ డబ్బులకు ఆశపడి, ఎస్సై ఆదేశాలను అవకాశంగా తీసుకుని ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. ఆ తరువాత ఆ కేసుకు సంబంధించిన కాగితాలను కోర్టుకు సమర్పించారు. ఆలస్యంగా తన సంతకం ఫోర్జరీ అయ్యిందని గ్రహించిన ఎస్సై శ్రీదేవి వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. విచారణ జరిపిన అధికారులు వరంగల్ పోలీస్ కమిషనర్‌కు నివేదిక సమర్పించడంతో కానిస్టేబుళ్లు సురేశ్, రాజులపై సీపీ రెండు రోజుల క్రితం సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మారని తీరు..

సంవత్సరాల తరబడి శిక్షణాలు పూర్తి చేసిన పోలీస్ అధికారులు కాసుల కక్కుర్తి కోసం అడ్డదారులు తొక్కుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. దీంతో పోలీస్‌శాఖ పరువు బజారున పడుతోంది. కమిషనరేట్ పరిధిలో జరిగిన రెండు హత్య కేసుల్లో ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రధాన నిందితులుగా ఉండడం గమనార్హం. ఇటీవల సస్పెండ్‌కు గురైన ఇద్దరు కానిస్టేబుళ్లు కూడా గతంలోనూ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ కావడం కొసమెరుపు. గతంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో, శాయంపేట పోలీస్ స్టేషన్, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడి సస్పెండ్ అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఉన్నతాధికారులు తీసుకుంటున్న క్రమశిక్షణ చర్యలు కూడా బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. అవినీతికి పాల్పడుతున్న పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే పోలీస్ శాఖ గాడిన పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇంటెలిజెన్స్ డీజీని కలిసిన సీపీ


డీజీకి మొక్క అందజేస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం: తెలంగాణ ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం హనుమకొండలోని పోలీస్ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. కాళేశ్వరం పుష్కరాలకు వెళ్తున్న డీజీ శివధర్‌రెడ్డి మార్గమధ్యలో పోలీస్ అతిథి గృహానికి చేరుకున్న సందర్భంగా సీపీ కలిశారు. ఈసందర్భంగా ఇరువురు అధికారులు పలు అంశాలపై చర్చించారు.

వేయిస్తంభాల ఆలయ దర్శన వేళల్లో మార్పు

హన్మకొండ కల్చరల్: సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని వేయిస్తంభాల ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు సందర్శిస్తున్నందున భక్తుల సౌకర్యార్థం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకోవచ్చునని ఆలయ ఈఓ అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులుగా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది పుష్కరస్నానాలు చేసి దేవాలయాన్ని సందర్శిస్తున్నారని ఈ మేరకు రుద్రేశ్వరాలయ సందర్శన వేళల్లో మార్పునకు కేంద్ర పురావస్తు శాఖ అనుమతించిందని తెలిపారు. అలాగే సరస్వతీ పుష్కరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి మంగళవారం దేవాలయాన్ని హైకోర్టు జస్టిస్ కళాసికం సుజనా సందర్శించి పూజలు చేశారు.

పట్టుబడిన గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ విభాగం ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 19 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.4.28 లక్షల విలువైన 856 కిలోల గంజాయిని మంగళవారం అమ్మవారిపేటలోని కాకతీయ మెడిక్లీన్ సర్వీస్‌లో డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సమక్షంలో దహనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రవి, ఏసీపీ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

పది రోజులుగా టెంట్‌కిందనే..

● మృతదేహంతో ఇంటికి రావద్దని యజమాని
● కాలం చేసిన భర్త అంతిమ కార్యక్రమాలు టెంట్‌కిందనే..


ఖాళీప్లాట్‌లో ఏర్పాటుచేసిన టెంట్ కింద ఉంటున్న లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు

పాలకుర్తి టౌన్: ఆయన యోగా గురువు. ఎంతోమందికి యోగా నేర్పాడు. ఏనాడూ డబ్బులకు ప్రాధాన్యం ఇవ్వలేదు. అద్దె ఇల్లు. తనకంటూ ఏమీ సంపాదించుకోలేదు. చివరికి అనారోగ్యంతో చనిపోగా, ఇంటి యజమాని ఒప్పుకోకపోవడం, పది రోజుల కార్యక్రమాలయ్యే వరకు రావద్దని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఖాళీ ప్లాట్‌లో టెంట్ వేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పది రోజులుగా అదే టెంట్‌లో కాలం గడుపుతున్నారు. ఈ విషాద ఘటన జనగామ జిల్లా పాలకుర్తిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పాలకుర్తి మండల కేంద్రం, చుట్ట పక్కల గ్రామాల్లో ఒకప్పుడు ఎల్ఎస్ టైలర్‌గా దార్ల లక్ష్మీనారాయణ ఓ వెలుగు వెలిగాడు. డబ్బులకు ప్రాధాన్యం ఇవ్వకుండా యోగా గురువుగా ఎంతోమంది కష్టసుఖాల్లో పాలు పంచుకున్నాడు. పది రోజులక్రితం అనారోగ్యం బారిన పడి చనిపోయాడు. మృతదేహం ఉంచేందుకు ఇంటి యజమాని ఒప్పుకోలేదు. దీంతో వారికున్న ఖాళీ స్థలంలో(ప్లాట్)లో టెంట్ వేసి దహనసంస్కారాలు నిర్వహించారు. పది రోజుల వరకు ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి. దీంతో ఆ టెంట్‌కు చుట్టూ పరదాలు కట్టుకొని కాలం వెళ్లదీస్తూ మిగతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక వైపు ఈదురుగాలులు, వర్షం పడుతున్నా టెంట్‌కిందనే జీవనం సాగిస్తున్న దైన్యం. దశదిన కర్మ కార్యక్రమానికి కూడా చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితి. ఎవరైనా ఆపన్నహస్తం అందిస్తారని ఆశగా చూస్తున్నట్లు కుమారుడు దార్ల ఉపేందర్ తెలిపాడు.